సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 18 । ఆగస్టు । 2023



సేవలకు గుర్తింపు

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న పీహెచ్‌సీలకు కేంద్రం ఏటా పురస్కారాలు అందిస్తోంది. 8లో▸



వంట.. బిల్లుల తంటా!

మధ్నాహ్న భోజనం పథకానికి ప్రభుత్వం ఇచ్చే బిల్లులకు, పెరిగిన ధరలకు పొంతన లేదని నిర్వాహకులు అంటున్నారు. 9లో▸



హామీలు మరచిన సర్కారు

ఎన్నికల హామీలను అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు సతీష్‌ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 9లో▸

న్యూస్‌రీల్

ఆరోగ్య రథంతో సత్వర వైద్యం

చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి



ఆరోగ్య రథాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పూడూరు: గ్రామీణ ప్రాంత ప్రజలకు సత్వర వైద్య సేవలు అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతోనే ఆరోగ్య రథాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి తెలిపారు. గురువారం పూడూరులో స్థానిక ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డితో కలిసి ఆరోగ్య రథం సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయరాదని సూచించారు. ఈ వాహనంలో సిబ్బంది ప్రజలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. పేదల కోసం సొంత డబ్బుతో ఉచిత వైద్యం అందించిన ఎంపీ రంజిత్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజారుద్దీన్, పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, సర్పంచ్ నవ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

వికారాబాద్ అర్బన్: పట్టణంలోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈ నెల 19న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆ శాఖ అధికారి అబ్దుల్ సుభాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ఎన్ లాబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో టెక్నికల్ ట్రైనర్స్, టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎంపిక ఉంటుందని తెలిపారు. ఇంటర్, డిగ్రీ పూర్తయిన అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. 18 ఏళ్ల నుంచి 25 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులని, హైదరాబాదులో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9676047444లో సంప్రదించాలని ఆయన సూచించారు.

నేటితో ముగియనున్న టెండర్ల గడువు

మద్యం దుకాణాలకు 1,797 దరఖాస్తులు




టెండర్లు వేసేందుకు వచ్చిన వ్యాపారులు

అనంతగిరి: జిల్లాలో మద్యం దుకాణాలకు దరఖాస్తుల ప్రక్రియ శుక్రవారంతో ముగియనుంది. చివరి రోజు పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు 59 దుకాణాలకు 1,797 దరఖాస్తులు వచ్చాయని జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి నవీన్ చంద్ర తెలిపారు. వికారాబాద్ ప్రాంతంలో 15 దుకాణాలకు గాను 598, పరిగిలో 12కు 417, తాండూరులో 18కి 363, కొడంగల్‌లో 8కు 164, మోమిన్‌పేటలో 6 దుకాణాలకు 255 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

'ఓపెన్' గడువు పొడిగింపు

కొడంగల్ రూరల్: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2023 – 24 విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు సెప్టెంబర్ 5వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జే రాజారాం తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థుల ట్యూషన్ ఫీజు సెప్టెంబర్ 5లోపు చెల్లించాలన్నారు. డిగ్రీ ఫస్ట్ ఇయర్‌లో చేరే విద్యార్థులు రెగ్యులర్ ఇంటర్, ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు.

రికార్డుల నిర్వహణ భేష్



బంట్వారం: అంబులెన్స్ రికార్డుల నిర్వహణ బాగుందని 108 జిల్లా ఇన్‌చార్జ్ విఘ్నేశ్వర్ అన్నారు. గురువారం ఆయన బంట్వారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని 108 అంబులెన్స్‌ను పరిశీలించారు. రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈఎంటీ మోహన్, పైలెట్ బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

గులాబీలో ఉత్కంఠ



బీఆర్‌ఎస్‌లో సిట్టింగులకే టికెట్లు అంటూ ప్రచారం

- ఆశావహుల్లో ఆందోళన
- ఎమ్మెల్యేల వ్యతిరేక వర్గాల రహస్య సమావేశాలు
- పార్టీలో ఉండాలా.. వీడాలా అనే సమాలోచనలు
- మహేందర్‌రెడ్డి మద్దతుదారుల్లో మొదలైన ఆందోళన

వికారాబాద్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఆర్ఎస్ ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. త్వరలో అధికార పార్టీ మొదటి జాబితాను ప్రకటిస్తుందన్న వార్తల నేపథ్యంలో టికెట్లు ఆశిస్తున్న వారిలో ఆందోళన మొదలైంది. దశాబ్దాలుగా పార్టీనే నమ్ముకున్న తమ పరిస్థితి ఏంటనే ఆలోచనలో పడ్డారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సిట్టింగుల తోపాటు పలువురు నేతలు టికెట్లు ఆశిస్తున్నారు. అధిష్టానం మాత్రం సిట్టింగులకే మళ్లీ టికెట్లు కేటాయిస్తుందనే ప్రచారం కూడా ఊపందుకుంది. అయితే ప్రస్తుత ఎమ్మెల్యేలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో టికెట్లు తమకే కేటాయించాలని ఎమ్మెల్యేల వ్యతిరేకవర్గం నేతలు కోరుతున్నారు. కొందరు నేరుగా అధిష్టానాన్ని కలిసి తమ పేర్లను పరిశీలించాలని కోరుతుండగా, మరికొందరు అధిష్టానానికి దగ్గరగా ఉండే వారి ద్వారా తమ అభీష్టాన్ని తెలిసేలా చేస్తున్నారు.

రహస్య సమావేశాలు

త్వరలో బీఆర్ఎస్ మొదటి జాబితా వచ్చే అవకాశం ఉండడంతో టికెట్లు ఆశిస్తున్న ఎమ్మెల్యేల వ్యతిరేక వర్గం నేతలు తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల వారు రహస్యంగా సమావేశమై తమ కార్యాచరణపై సమాలోచనలు చేశారు. ప్రజా వ్యతిరేకత మూటగట్టుకున్న ఎమ్మెల్యేలకు టికెట్లు కేటాయిస్తే వారి ఓటమికి కృషి చేస్తామని తేల్చి చెబుతున్నారు. ఇదే విషయాన్ని కొందరు బాహాటంగానే ప్రకటిస్తున్నారు. పార్టీనే నమ్ముకున్న తమకు టికెట్లు ఇవ్వకపోతే పార్టీకి సేవ చేసి ప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ వాతావరణం వికారాబాద్‌లో ఎక్కువగా కనిపిస్తోంది. ప్రస్తుత ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఉన్న నలుగురు నేతలు బీఆర్ఎస్ టికెట్ కోసం ప్రయత్నం చేస్తున్నారు. పరిగిలో ఒకరు, తాండూరులో ఇద్దరు నేతలు టికెట్ల కోసం పావులు కదుపుతున్నారు. అయితే కొందరు నేతలు టికెట్లు రాకుంటే పార్టీ వీడేందుకు సైతం సిద్ధమని తెగేసి చెబుతున్నారు. మరికొందరు పార్టీలోనే ఉంటూ టికెట్ల కోసం ఫైట్ చేస్తామని, రాని పక్షంలో ఎమ్మెల్యేల ఓటమికి కృషి చేస్తామని అంటున్నారు.

ఆయన్ను నమ్ముకుని ఆగమవుతున్నామా?

జిల్లాలో ప్రస్తుత ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా ఎనిమిది మంది టికెట్లు ఆశిస్తున్నారు. అయితే ఇందులో సగానికి పైగా నేతలు మహేందర్‌రెడ్డి వర్గంలో కొనసాగుతున్నారు. ఆయన పార్టీ వీడుతారనే వార్తలు వచ్చిన నేపథ్యంలో మెజార్టీ నాయకులు ఆయన వెంటే ఉండాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇటీవల అధిష్టానం మహేందర్‌రెడ్డితో సంప్రదింపులు జరిపింది. పార్టీ అధికారంలోకి రాగానే సముచిత స్థానం కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో ఆయన పార్టీ వీడాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే మహేందర్‌రెడ్డికి స్వ ప్రయోజనాలే తప్ప తమ బాగు గురించి ఆలోచించడం లేదని అనుచరులు అంటున్నారు. పార్టీలో ఆయన తమకు గాడ్ ఫాదర్‌గా ఉంటాడని నమ్మి ఆగమవుతున్నామా.? అనే సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆయన పార్టీ వీడినా వీడకపోయినా.. అధిష్టానం మాత్రం తమను గుర్తించాలని లేకుంటే పార్టీని వీడుతామని అసమ్మతి నేతలు తెగేసి చెబుతున్నారు.

రోహిత్‌రెడ్డికి అండగా నిలుద్దాం

భారీ మెజార్టీతో అసెంబ్లీకి పంపాలి

- కాంగ్రెస్‌ను నమ్మితే మూడు గంటల కరెంటే
- ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- తాండూరులో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ

తాండూరు: తాండూరు అసెంబ్లీ స్థానం నుంచి మరోసారి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. పట్టణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని గురువారం ఆయన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డితో కలసి ఆవిష్కరించారు. పొట్లి మహరాజ్ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలకు కళ్లు మండుతున్నాయని విమర్శించారు. మంత్రులను తిడితే ప్రజలు సహించరన్నారు. సీఎం కేసీఆర్‌పై అసత్య ఆరోపణలు చేస్తే ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న వారికి గుణపాఠం చెప్పేందుకు త్వరలో కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. తాండూరు ప్రాంతం దేశంలోనే గుర్తింపు పొందిందన్నారు. ఇక్కడి కంది పప్పుకు భౌగోళిక గుర్తింపు లభించిందని గుర్తు చేశారు. కర్ణాటక సరిహద్దులో ఉన్న తాండూరు నియోజకవర్గం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. అయితే కర్ణాటకలోని పలు ప్రాంతాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయన్నారు. పాపన్న గౌడ్ కాలంలో దొరల కోటలను కూలగొట్టి బహుజన రాజ్య స్థాపనకు నడుం బిగించారని పేర్కొన్నారు. అలాంటి మహా మనిషిని చరిత్రలో లేకుండా చేశారన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ చరిత్ర కారులకు గౌరవం దక్కిందన్నారు. గౌడ కులస్తులది నీతిగల జాతి అన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను మరోసారి అధికారంలోకి వచ్చేలా పని చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. తాండూరులో ఎక్సైజ్ శాఖ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కోట్‌పల్లి ప్రాజెక్ట్‌ను పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ఇప్పటికే నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ రవికుమార్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయల సంస్థ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వనాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

మంత్రికి వినతి



తాండూరు టౌన్: తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్‌లో విధులు నిర్వహిస్తున్న తమను క్రమబద్ధీకరించాలని పలువురు గురువారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 21వేలకు పైగా ఉద్యోగులు విద్యాశాఖలో కీలకంగా పని చేస్తున్నారని తెలిపారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.

రెగ్యులరైజ్ చేయాలి

తమను రెగ్యులరైజ్ చేయాలంటూ సెకండ్ ఏఎన్‌ఎంలు మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని వారు మంత్రిని కోరారు.

ఆర్థిక ప్రగతి సాధించాలి



మాట్లాడుతున్న సందీప్‌కుమార్ సుల్తానియా (చిత్రంలో) సెర్ప్ సీఈఓ గౌతమ్, కలెక్టర్ నారాయణరెడ్డి

- పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా
- మహిళా రైతులతో సమావేశం
- వ్యవసాయ యంత్రాల పరిశీలన

తాండూరు రూరల్: మహిళా రైతు ఉత్పత్తి దా రుల కంపెనీ(ఎఫ్‌పీసీ) సభ్యులు ఆర్థిక ప్రగతి సాధించాలని పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా సూచించారు. గురువారం పట్టణంలోని ఐకేపీ కార్యాలయంలో ఎఫ్‌పీసీ సభ్యులతో సమావేశమయ్యారు. 2021లో ప్రభుత్వం వారికి అందజేసిన వ్యవసాయ పరికరాలు, యంత్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళా రైతులతో కలిసి ఎఫ్‌పీసీ సంఘాన్ని ఏర్పాటు చేశారన్నారు. వీరికి రూర్బన్ పథకం కింద రూ.30 లక్షలు, స్త్రీనిధి కింద రూ.17 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో వారు హర్వేస్టర్, మల్టీ క్రాప్ మిషన్, ట్రాక్టర్‌ను కొనుగోలు చేసినట్లు తెలిపారు. వీటిని తోటి రైతులకు అద్దెకు ఇస్తూ సంఘం ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో వీటిపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అవసరమైతే ప్రైవేటు వ్యక్తుల కన్నా తక్కువ ధరలకే పరికరాలను రైతులకు అద్దెకు ఇవ్వాలని సూచించారు.

గ్రామాల్లో పర్యటించాలి

తాండూరు మహిళా రైతు ఉత్పత్తి దారుల కంపెనీ సభ్యులు ప్రతి గ్రామంలో పర్యటించి వ్యవసాయ పరికరాలు.. వాటి అద్దె వివరాల పై విస్తృతంగా ప్రచారం చేయాలని సెర్ప్ సీఈఓ గౌతమ్ సూచించారు. కలెక్టర్ నారాయణరెడ్డి, డీఆర్‌డీఓ కృష్ణన్, డీపీఎం శ్రీనివాస్, ఏపీఎం ఆనంద్, ఎఫ్‌పీసీ చైర్మన్ వెంకట లక్ష్మీ, వైస్ చైర్మన్ అంబిక, మహిళ సమాఖ్య మండల అధ్యక్షురాలు రేణుక, సీసీలు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాల బాధ్యత జీపీలదే

వికారాబాద్ అర్బన్: పూర్తయిన క్రీడా ప్రాంగణాల నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలదేనని ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పల్లె ప్రగతి, క్రీడా ప్రాంగణాల నిర్వహణ, హరితహారంపై కలెక్టర్ నారాయణరెడ్డి, సెర్ప్ సీఈవో గౌతమ్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మంచి ఉద్దేశంతో చేపట్టిన క్రీడా ప్రాంగణాలు సౌకర్యవంతంగా ఉండాలన్నారు. జిల్లాలో కొత్తగా 269 జీపీలకు భవనాలు మంజూరైనట్లు తెలిపారు. అనంతరం సెర్ప్ సీఈఓ గౌతమ్ కుమార్, కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడారు. అనంతరం డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను వారు పరిశీలించారు. డీఆర్‌డీఓ కృష్ణన్, జెడ్పీ సీఈవో సుభాషిని, డీపీఓ తరుణ్ కుమార్, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏసీడీ నర్సింలు, డీసీఎం శ్రీనివాస్, ఎల్‌డీఎం రాంబాబు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు

అనంతగిరి: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ప్రభుత్వం మాదేనని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. బీసీ చేతి వృత్తుల వారికి మంజూరైన లక్ష రూపాయల ఆర్థిక సాయం చెక్కులను గురువారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రకళ, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, పీఎస్‌సీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కమల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

ఓటరుగా నమోదు చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న లింగ్యా నాయక్

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

కొడంగల్: అక్టోబర్ ఒకటో తేదీ నాటికి జిల్లాలో 18 ఏళ్లు నిండే వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్, కొడంగల్ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి లింగ్యానాయక్ సూచించారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్, డీటీలు, వార్డెన్లు, ఎంఈఓలు, ఐసీడీఎస్, పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ నెల 19న పట్టణంలోని అంగడిబజార్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు 5కే రన్ ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని యువకులు, విద్యార్థులు, విద్యావంతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆగస్టు 21న ఓటరు డ్రాఫ్ట్ పబ్లికేషన్ విడుదల చేయనున్నట్లు చెప్పారు. అదే రోజు అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి ఏమైనా తప్పులు ఉంటే సరి చేసుకోవచ్చని తెలిపారు. ఆగస్టు 26, 27 తేదీల్లో ఓటు హక్కుపై ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు విజయకుమార్, వెంకటేష్, శ్రీనివాస్, పాండు, సీ విజయకుమార్, జయరాం, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ పాండు, సీడీపీఓ జయరాం, ఎంఈఓ రాంరెడ్డి, ఎస్ఐ గోపాల్, ఎలక్షన్ డీటీ శివకుమార్, డీటీ సురేష్, వార్డెన్లు పాల్గొన్నారు.

నిలిచిన సేవలు

- సమ్మె బాట పట్టిన ఏఎన్‌ఎంలు
- క్షేత్రస్థాయిలో ఇబ్బందులు
- ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్
- లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని వెల్లడి



నిరవధిక సమ్మె చేస్తున్న మొదటి ఏఎన్‌ఎంలు

వికారాబాద్ అర్బన్: మొదటి ఏఎన్ఎంలు సమ్మె బాట పట్టడంతో క్షేత్రస్థాయిలో సేవలు నిలిచిపోయాయి. దీంతో గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, విధి నిర్వహణలో ఉన్న ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేస్తూ మూడు రోజుల క్రితం సీఐటీయూ ఆధ్వర్యంలో మొదటి ఏఎన్ఎంలు నిరవధిక సమ్మెకు దిగారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవల్లో తమ శ్రమ ఎంతో ఉందని, తమ కష్టాన్ని ప్రభుత్వం గుర్తించాలని వారు కోరుతున్నారు. సమ్మె కారణంగా జిల్లా వ్యాప్తంగా ఏఎన్ఎంల సేవలు నిలిచిపోయాయి.

ఏ కార్యక్రమమైనా ఏఎన్‌ఎంలతోనే..

ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త కొత్త కార్యక్రమాలు చేపడుతుంటాయి. అవి క్షేత్రస్థాయిలో అమలు కావాలంటే ఏఎన్ఎంల పాత్ర ఎంతో ముఖ్యం. గ్రామాల్లో ఎంతమంది గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు ఉన్నారు. వారి ఆరోగ్య పరిస్థితి ఏమిటి అనే పూర్తి సమాచారం వీరి వద్దే ఉంటుంది. పై అధికారులకు ఎప్పుడు ఏ సమాచారం కావాలన్నా వీరి ద్వారానే సేకరించాల్సి ఉంటుంది. పైగా పిల్లలకు వేసే నెల వారి టీకాల బాధ్యత కూడా వీరిదే. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హెల్త్ ప్రొఫైల్ సర్వేలు చేయాల్సి వచ్చినా, ఇతర సమాచారం సేకరించాల్సి వచ్చినా ఏఎన్ఎంల మీదే ఆధారపడాల్సి ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే గ్రామానికి ఏఎన్ఎంఏ ఓ వైద్యురాలు.

పనిభారం ఎక్కువ

క్షేత్రస్థాయిలో పనిభారం ఎక్కువగా ఉందని, అయినా శ్రమకు తగ్గ వేతనం అందడం లేదని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఏఎన్ఎంలు అంటున్నారు. జియో యాప్ ద్వారా హాజరు వేస్తుండడంతో ఉన్నతాధికారుల వేధింపులకు గురికావాల్సి వస్తోందని అంటున్నారు. జియో యాప్‌ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎంలకు డిపార్టుమెంట్‌లో నిర్వహించే పరీక్షలను రద్దు చేయడంతో పాటు, 20 ఏళ్లుగా సేవలందిస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతున్నారు. కోవిడ్ కష్ట సమయంలో కుటుంబాలకు దూరంగా ఉండి, ప్రాణాలకు తెగించి సేవలు అందించినా ప్రభుత్వం తమను గుర్తించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తమకు గతంలో ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్టు పద్ధతిని రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

వెట్టి చాకిరీ చేయిస్తున్నారు



ప్రభుత్వం మాతో వెట్టి చాకిరీ చేయిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో 20 ఏళ్లుగా సేవలు అందిస్తున్నా గుర్తింపు లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య ఆరోగ్య శాఖలో ఏ కార్యక్రమం ప్రారంభించాలన్నా మా సహకారం ఉండాల్సిందే. ఇప్పటికైనా మా డిమాండ్లు తీర్చాలి.

– లీలావతి, యునైటెడ్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు

ఉద్యోగులుగా గుర్తించాలి



క్షేత్ర స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్న మొదటి ఏఎన్ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. గతంలో ప్రభుత్వం కాంట్రాక్టు పద్ధతిని రద్దు చేస్తామని హామీ ఇచ్చింది. ఆ హామీనే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తేనే సమస్యకు పరిష్కారం.

– లలిత, యునైటెడ్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

హామీ నెరవేర్చే వరకు సమ్మె



ఏఎన్ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. అప్పటి వరకు వారికి మద్దతుగా సమ్మెను కొనసాగిస్తాం. ప్రభుత్వం స్పందించకుంటే సమ్మెను ఉధృతం చేస్తాం. మొదటి ఏఎన్ఎంలకు కనీస వేతనం అమలు కావడం లేదు. వారి సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించాల్సిందే.

– మహిపాల్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

సాయికిరణ్‌కు సన్మానం



సాయికిరణ్‌ను సన్మానిస్తున్న సభ్యులు

కొడంగల్ రూరల్: షాట్‌పుట్ విభాగంలో అనేక బంగారు పతకాలు సాధించిన విద్యార్థి సాయికిరణ్‌ను గురువారం పట్టణంలోని నగరేశ్వర స్వామివారి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన విద్యార్థి సాయికిరణ్ క్రీడాపోటీల్లో షాట్‌పుట్ విభాగంలో ఉత్తమ ప్రతిభ చాటుతూ అనేక బహుమతులు సొంతం చేసుకున్నాడు. సాయికిరణ్ ప్రతిభను గుర్తించిన మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల వారు అతడి ఫొటోతో నోటుపుస్తకాలపై ప్రింట్ చేయించి విద్యార్థులకు అందించనున్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు శివకుమార్‌గుప్త, శ్రీనివాస్, ఆంజనేయులు, ఎల్లయ్య, ప్రవీణ్, చందూ, వీరణ్ణ, నారాయణ, వినోద్, మురళి, పవన్‌కుమార్, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటర్ అవగాహనపై రేపు 5కే రన్: ఆర్డీఓ



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

తాండూరు రూరల్: 18ఏళ్ల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని తాండూరు డివిజన్ ఆర్డీఓ శ్రీనివాస్‌రావు అధికారులను ఆదేశించారు. తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తాండూరు, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ తహసీల్దార్లతో ఆర్డీఓ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శనివారం ఉదయం 6 గంటలకు తాండూరు పట్టణంలోని ఇందిరాచౌక్ నుంచి సెయింట్‌మార్క్స్ స్కూల్ వరకు 5కే రన్ నిర్వహిస్తామని తెలిపారు. 'నేను ఓటరుగా గర్విస్తున్నా' అనే నినాదంతో కార్యక్రమాలు ఉంటాయన్నారు.

సాగు భూములకు దారి చూపాలి



రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఆర్‌ఐ

మర్పల్లి: ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ పట్టా సాగు భూములకు నక్షబాట (దారి) చూపాలని మర్పల్లి మండలం దామస్తాపూర్ రైతులు తహసీల్దార్‌కు ఈ నెల 10న ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ గణేశ్‌ను రైతులు గురువారం కలిసి సమస్య వివరించారు. సర్వే నంబర్ 150లో తమ పెద్దల కాలం నుంచి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని చెప్పారు. కానీ ఇటీవల ఓ రైతు ప్రభుత్వం ఇచ్చిన అదే అసైన్డ్ పట్టా భూమిలో నుంచి తమ పొలాలకు వెళ్లకుండా అడ్డు కుంటున్నట్లు రైతులు తెలిపారు. దీంతో తమ పొలాలకు వెళ్లని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. స్పందించిన తహసీల్దార్.. రైతుల సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలని ఆర్‌ఐ దశరథ్‌ను ఆదేశించారు. అనంతరం ఆర్‌ఐ సర్వే నంబర్‌లో రైతులు సాగు చేసుకుంటున్న పంట పొలాలను పరిశీలించి వివరాలు సేకరించారు. త్వరలో సమస్య పరిష్కరిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. అంతవరకు ఆందోళన చెందరాదని చెప్పారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపు మనదే

- చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభను విజయవంతం చేయండి
- నాయకులు, కార్యకర్తలకు మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

షాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ బలంగా ఉందని, వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపును ఎవరూ అడ్డుకోలేరని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. చేవెళ్ల గడ్డపై నిర్వహించే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభను విజయంతం చేయాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఆన్‌మోల్ గార్డెన్‌లో గురువారం నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 24న చేవెళ్లలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేస్తే కర్ణాటక తరహాలో తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. నియోజకవర్గంలో స్థానికులకే ఎమ్మెల్యే టికెట్ ఇప్పించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ కార్యకర్తలు నిరంతరం ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వహణ సభ్యుడు పామెన భీంభరత్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, కార్యదర్శులు పీసరి సురేందర్‌రెడ్డి, ఎన్. రాంరెడ్డి, మెంబర్ షాబాద్ దర్శన్, సీనియర్ నాయకులు సున్నపు వసంతం, దేశమల్ల ఆంజనేయులు, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, మహిళా అధ్యక్షురాలు అశ్విని తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల సభకు తరలిరావాలి..

శంకర్‌పల్లి: చేవెళ్లలో నిర్వహించే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి ప్రసాద్ కుమార్ పిలుపు నిచ్చారు. స్థానిక నాయకులతో కలిసి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి నుంచే కార్యకర్తలు ఎన్నికలకు సన్నద్ధం కావాలని అన్నారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. లక్షల మందితో చేవెళ్ల సభను విజయవంతం చేద్దామన్నారు. పార్టీ అధికార ప్రతినిధి గౌరీసతీష్, సీనియర్ నాయకుడు ఉదయమోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, నాయకులు ఇంపుల సత్యనారాయణరెడ్డి, సున్నపు వసంతం, షాబాద్ దర్శన్, భీంభరత్ పాల్గొన్నారు.

కూతుళ్ల ముందే తుదిశ్వాస

గుండెపోటుతో రైతు మృతి

- బొంరాస్‌పేట మండలం రేగడిమైలారంలో విషాదం



మల్లప్ప(ఫైల్)

బొంరాస్‌పేట: పొలంలో పత్తిపంటకు పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలు.. బొంరాస్‌పేట మండల పరిధిలోని రేగడిమైలారం గ్రామానికి చెందిన కోటగారి పెద్ద మల్లప్ప (49)రైతు. అతడికి నలుగురు కూతుర్లు, భార్య సావిత్రమ్మ ఉన్నారు. వ్యవసాయం చేస్తూ ఇద్దరు కూతుర్ల పెళ్లి చేశాడు. మరో ఇద్దరు కూతుర్లను చదివిస్తున్నాడు. మూడు రోజులుగా ఛాతీలో నొప్పి వస్తోందని కుటుంబ సభ్యులకు చెప్పాడు. ఈ నేపథ్యంలో గ్రామంలో వైద్యం చేయించుకున్నాడు. గురువారం తన పత్తిపొలంలో కూతుళ్ల సహకారంతో పురుగుమందు పిచికారీ చేస్తున్నాడు. ఈ క్రమంలో ఛాతీలో నొప్పి వస్తుందని ఒక్కసారిగా కూర్చుండిపోయాడు. కూతుళ్ల ముందే స్పృహ కోల్పోయి పడిపోయాడు. హుటాహుటిన కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మల్లప్ప మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. రైతుబంధు సంఘం అధ్యక్షుడు గోవిందరెడ్డి, రైతుబంధు ఉపాధ్యక్షుడు బలిజ శేఖర్, శ్యామలయ్యగౌడ్ తదితరులు మల్లప్ప కుటుంబ సభ్యులను పరామర్శించారు.

శిక్షణతో వృత్తి నైపుణ్యం

పరిగి: భవన నిర్మాణ కార్మికులకు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ఇవ్వడం అభినందనీయమని రైతుబంధు మండల కోఆర్డినేటర్ రాజేందర్ అన్నారు. పరిగి మండలం నస్కల్‌లో జన్‌స హస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో న్యాక్ వారిచే కార్మికులకు 15 రోజులుగా వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించారు. గురువారం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్మికులకు శిక్షణే కాకుండా ప్రతిరోజు మధ్యాహ్నం భోజనంతో పాటు రూ.300 ఇవ్వడం వారి కుటుంబాలను ఆదుకోవడమే అవుతుందన్నారు. తరగతుల ద్వారా కార్మికుల్లో వృత్తి నైపుణ్యం పెరిగి, పనిలో చాలా మార్పులు చోటుచేసుకుంటాయని, ఎలా చేయాలో కూడా తెలుస్తాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశ్, ట్రైనర్ ప్రసాద్, యాదగిరి, రాజయ్య, ఉప సర్పంచ్ నగేష్ ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు



పూడూరు: మీర్జాపూర్‌లోని వెజిటేబుల్ నర్సరీని పరిశీలిస్తున్న సందీప్‌కుమార్ సుల్తానియా

పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా

బంట్వారం: విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా హెచ్చరించారు. గురువారం ఆయన కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి కోట్‌పల్లి మండల కేంద్రంలోని డంపింగ్‌యార్డును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతిరోజు తడి-పొడి చెత్త సేకరణ చేపట్టాలని తెలిపారు. కోట్‌పల్లిలో చెత్త సేకరణ సక్రమంగా లేకపోవడంతో ఆయన సంబంధిత అధికారులు, స్థానిక సర్పంచ్‌పై అసహనం వ్యక్తం చేశారు. అంతకుముందు సెర్ప్ ఆధ్వర్యంలో రూ.19.45 లక్షల బ్యాంక్ లింకేజీ పెట్టుబడితో నిర్వహిస్తున్న ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్‌ను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సీఈఓ గౌతం, డీఆర్‌డీఓ కృష్ణన్, జెడ్పీ సీఈఓ సుభాషిణి, డీపీఓ తరుణ్‌కుమార్, తహసీల్దార్ ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినయోగం చేసుకోవాలి..

పూడూరు: ప్రభుత్వ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా అన్నారు. మండల పరిధిలోని కండ్లపల్లి, ఎన్కేపల్లి, మీర్జాపూర్ గ్రామాల్లో సెర్ప్ ద్వారా డ్వాక్రా మహిళలకు ఇచ్చిన బ్యాంక్ లింకేజీ రుణాల ద్వారా ఏర్పాటు చేసిన నీలగిరి కేఫ్, మీర్జాపూర్‌లో ఏర్పాటు చేసిన వెజిటేబుల్ నర్సరీ, ఎన్కేపల్లిలో నిర్మించిన వజ్ర మినీ దాల్ మిల్లును గురువారం ఆయన పరిశీలించారు. వ్యాపారాన్ని విస్తరించి ఆర్థిక ప్రగతి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సి.నారాయణరెడ్డి, సెర్ప్ సీఈఓ గౌతమ్, డీపీఓ తరుణ్, డీఆర్‌డీఓ క్రిష్ణన్, జెడ్పీ సీఈఓ సుభాషిణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపు

- జాతీయ పురస్కారానికి ఎంపికైన దౌల్తాబాద్ పీహెచ్‌సీ
- అవార్డుకింద ఆస్పత్రి అభివృద్ధికి ఏటా రూ.2లక్షల అదనపు నిధులు
- సమష్టి కృషే కారణమంటున్న సిబ్బంది



దౌల్తాబాద్ పీహెచ్‌సీ

దౌల్తాబాద్: గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కేంద్రం ఏటా జాతీయ పురస్కారాలు అందిస్తూ వస్తోంది. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో సమస్యలు అధిగమిస్తూ జాతీయ ప్రమాణాలు పాటించి కేంద్ర ప్రభుత్వం అందించే నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్వాస్) అవార్డుకు దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపికైంది. వివరాలు.. కేంద్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అందించే అత్యుత్తమ పురస్కారానికి ఎంపిక చేసేందుకు ఎన్‌క్వాస్ బృందం అధికారులు గత నెల 19, 20 తేదీల్లో రోజుకు సుమారు 12 నుంచి 14గంటల పాటు దౌల్తాబాద్ పీహెచ్‌సీని పరిశీలించారు. పీహెచ్‌సీకి ఎంతమంది వైద్యం కోసం వస్తున్నారు, వైద్య పరీక్షల కోసం ల్యాబ్ వసతి ఉందా.. పీహెచ్‌సీ ఆవరణలో పరిశుభ్రత, పచ్చదనం లాంటి అంశాలను కేంద్ర బృందంలోని అధికారులు పరిశీలించారు.

క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం..

జాతీయ ఆరోగ్య మిషన్ జారీచేసిన వివిధ అంశాలను ప్రామాణికంగా తీసుకుని జాతీయ పురస్కారాలకు ఎంపిక చేశారు. పీహెచ్‌సీకి ఎంతమంది రోగులు వస్తున్నారు. ఇన్ పేషంట్లుగా చేరిన వారికి అందిస్తున్న సేవలు, ల్యాబ్‌లు, మందులు అందిస్తున్న తీరు, నిల్వలు, మాతాశిశు సేవలు, ప్రసవాల గది, హరితహారం, జలసంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, మెడికల్ వ్యర్థాల నిర్వహణ వంటివి క్షేత్రస్థాయిలో పరిశీలించి దౌల్తాబాద్ పీహెచ్‌సీకి 100కుగాను 84.13 మార్కులు కేటాయించారు. ఈ నివేదికను కేంద్రానికి అందించగా.. పరిశీలన అనంతరం జాతీయ పురస్కారాని(ఎన్‌క్వాస్)కి దౌల్తాబాద్ పీహెచ్‌సీని ఎంపిక చేశారని అధికారులు తెలిపారు. అవార్డుకు ఎంపికైన పీహెచ్‌సీలకు క్రింది నిధులను కేంద్ర ప్రభుత్వం అందించనుంది.

మూడేళ్ల పాటు నిధులు..

- కేంద్ర ప్రభుత్వం అందించే ఎన్‌క్వాస్ అవార్డు కింద ఏటా రూ.2లక్షలు దౌల్తాబాద్ పీహెచ్‌సీకి మంజూరు చేస్తారని అధికారులు తెలిపారు.
- ఇలా మూడేళ్ల పాటు నిధులు అందనున్నాయి.
- ఈ నిధులను పీహెచ్‌సీలో అభివృద్ధి పనుల కోసం వెచ్చించాల్సి ఉంటుంది.
- పీహెచ్‌సీల అభివృద్ధికి వచ్చే సాధారణ నిధులతో పాటు అదనంగా ఎన్‌క్వాస్ నిధులు రావడంతో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి.

సమష్టి కృషితోనే అవార్డు



అధికారులు, వైద్యసిబ్బంది సమష్టి కృషితో పీహెచ్‌సీకి ఎన్‌క్వాస్ అవార్డు దక్కింది. పీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ప్రజాప్రతినిధుల, ఉన్నతాధికారుల సహకారం మరవలేనిది. అవార్డుతో మాపై మరింత బాధ్యత పెరిగింది.

– రతన్‌లాల్, వైద్యాధికారి, దౌల్తాబాద్ పీహెచ్‌సీ

'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: అర్హులందరికీ వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పలుపు మేరకు గురువారం షాద్‌నగర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆ పార్టీ నేతలు నిర్వహించిన మహాధర్నాలో ఆయన మాట్లాడుతూ... గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ఇళ్లులేని నిరుపేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చకపోగా.. ప్రస్తుతం మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో స్థలం ఉన్న వారికి గృహలక్ష్మి పథకం కింద రూ.3లక్షలు మంజూరు చేస్తామని మాయ మాటలు చెప్పి ప్రజలను మోసగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎంతోమంది నిరుపేదలు ఇళ్లులేక పూరిగుడిసెల్లో నివసిస్తున్నారని.. వారందరు ప్రభుత్వం పంపిణీ చేసే డబుల్ బెడ్‌రూం ఇళ్లకోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని అన్నారు. ఇప్పటికే నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను కూడా అర్హులకు కేటాయించడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ కన్వీనర్ విజయ్‌కుమార్, నాయకులు.. విష్ణువర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య, మిథున్‌రెడ్డి, అశోక్‌గౌడ్, వంశీకృష్ణ, వెంకటేష్, మురళి, అశోక్, వెంకటేష్, మోహన్‌సింగ్, లష్కర్ నాయక్, శ్రీనివాస్‌చారి, నర్సింహ, బాల్‌రాజ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ వైఫల్యాలను ఎండగడదాం..

కొత్తూరు: హామీల అమలులో బీఆర్‌ఎస్ సర్కార్ పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గోపాలచారి ఆరోపించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాగరాజుచారి ఆధ్వర్యంలో కొత్తూరు పట్టణంలోని పలు వార్డుల్లో గురువారం గోపాలచారి పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నాయకులు నర్సింహగౌడ్, నాగరాజుచారి, రణధీర్‌గౌడ్, మాణిక్యం, రమేష్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

ధారూరు: సత్యసాయి సేవా సమితీ ఆధ్వర్యంలో ధారూరు మండలం కేరెళ్లి, ఎబ్బనూర్ గ్రామాల్లో గురువారం ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేరెళ్లిలో 38 పశువులకు గర్భకోశ చికిత్స, 150 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసి, నట్టలమందు తాగించారు. 152 పశువులకు సాధారణ చికిత్స చేశారు. ఎబ్బనూర్‌లో 830 పశువులకు వివిధ రకాల చికిత్సలు అందజేశారు. పోషకాహార బస్తాలను ఉచితంగా పంపిణీ చేశారు.

టీకాలు ఇప్పించాలి..

పశువులకు బలవర్ధకమైన పోషక పదార్థాలు ఇవ్వాలని విశ్రాంత పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ పున్నయ్య రైతులకు సూచించారు. పశువులు గోమార్‌లు, పేలువాలి రక్తం పీల్చడం వలన అనారోగ్యానికి గురవుతున్నాయని, వీటి నివారణకు గాలికుంటు టీకా ఇప్పించి, నట్టల మందుతాగించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు స్వర్ణలత, హరిప్రియ, నరేంద్రనాథ్‌రెడ్డి, కేరెళ్లి సేవా సమితీ సభ్యులు రాజేందర్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అనంతయ్య, జగదీశ్వర్‌రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పోల్కంపల్లి పోలీస్

- కానిస్టేబుల్ నుంచి ఎస్‌ఐగా ఉద్యోగం
- పట్టుపట్టి పెద్ద కొలువు సాధించిన పేదింటి బిడ్డ
- తల్లి దినసరి కూలీ.. తండ్రి గీత కార్మికుడు
- యువతకు ఆదర్శంగా వంశీగౌడ్



తల్లిదండ్రులతో వంశీగౌడ్

ఇబ్రహీంపట్నం రూరల్: మండల పరిధిలోని పోల్కంపల్లికి చెందిన వంశీగౌడ్ కానిస్టేబుల్ నుంచి ఎస్‌ఐగా ఉద్యోగం సాధించాడు. గ్రామానికి చెందిన గుండ్ల నాగమణి దర్శన్‌గౌడ్ దంపతులకు వంశీ, మానస ఇద్దరు సంతానం. నాగమణి కూలీ పని చేస్తుండగా, దర్శన్‌గౌడ్ గీత కార్మికుడు. ఇద్దరు పిల్లలను ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో చదివించారు. వంశీగౌడ్ చిన్ననాటి నుంచి చదువుపై ఆసక్తి చూపేవాడు. 2014లో పదో పాసయ్యాడు. హస్తినాపురం (2016)లో ఇంటర్, నిజాం కాలేజీ (2019)లో డిగ్రీ పూర్తి చేశాడు. డిగ్రీ చదువుతుండగా ఎన్‌సీసీలో చేరి సీ సర్టిఫికెట్ సాధించాడు. 2019లో కానిస్టేబుల్ నోటిఫికేషన్ రావడంతో తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించాడు. అంతటితో ఆగకుండా నిత్యం డ్యూటీ ముగిసిన తర్వాత ఇంటికి వచ్చి చదువుపై శ్రద్ధ పెట్టాడు. ఇటీవల నిర్వహించిన ఎస్‌ఐల భర్తీలోనూ మొదటి ప్రయత్నంలోనే ఎన్‌సీసీ కోటాలో సివిల్ ఎస్‌ఐగా ఎంపికయ్యాడు. మొక్కవోని దీక్షతో కష్టపడి కఠోరంగా చదవడంతోనే కల సాకారమైందని వంశీ చెబుతున్నారు. తమ మామయ్యతో పాటు అమ్మ తరపు బంధువులు, బాబాయి సైతం పోలీసు కానిస్టేబుళ్లుగా పని చేస్తున్నారు. వీరి స్ఫూర్తితో ఎలాగైనా ఎస్‌ఐ సాధించాలని గట్టిగా నిర్ణయించుకుని, ఆదిశగా అలుపెరకుండా శ్రమించాడు. తన తల్లిదండ్రుల కష్టానికి తగిన గుర్తింపు తేవాలనే ఏకైక లక్ష్యంతోనే ముందుకు సాగానని చెబుతున్నారు.

ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యం

- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి
- శివారెడ్డిపల్లిలో 'మనఊరు–మనబడి' ప్రారంభం



పాఠశాల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

దోమ: ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. దోమ మండల పరిధిలోని శివారెడ్డిపల్లిలో రూ.50 లక్షలతో మనఊరు–మనబడి కింద నూతనంగా ఆధునీకరించిన పాఠశాలను గురువారం జెడ్పీటీసీ నాగిరెడ్డితో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, మధ్యాహ్న భోజనం, రాగిజావ, ఏకరూప దుస్తులు, తదితర వసతులను ప్రభుత్వమే కల్పిస్తుందన్నారు.

దళితబంధు కేటాయించండి..

గ్రామంలో నిరుపేద దళితులు చాలామంది ఉన్నారని వారందరికీ దళితబంధు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ నరేందర్‌రెడ్డి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డిని కోరారు. గ్రామంలో వివిధ రకాల పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటికి కూడా నిధులను కేటాయించాలని కోరారు. రైతువేదిక వరకు సీసీ రోడ్డు, మైనార్టీలకు శ్మశానవాటిక, కమ్యూనిటీ భవనం నిర్మించేందుకు నిధులను కేటాయించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. త్వరలో నిధులను కేటాయిస్తానని ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి హామీ ఇచ్చారు.

రూ.5 లక్షలతో ఈద్గా నిర్మాణం..

మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో రూ.5లక్షలతో ఈద్గా నిర్మాణానికి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, జెడ్పీటీసీ నాగిరెడ్డి గురువారం భూమిపూజ చేశారు. మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లేశం, ఈఈ రేణుకాదేవి, పీఆర్ డీఈ ఉమేశ్ కుమార్, ఏఈ మణికుమార్, ఇరిగేషన్ డీఈఈ ప్రార్థసారథి, ఏఈఈ సిద్దార్థ్, మండల విద్యాధికారి హరిశ్చందర్, స్కూల్ చైర్మన్ సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు, బొంపల్లి సర్పంచ్ సురేశ్, ఎంపీటీసీ రాములు, ఉపసర్పంచ్ రఫీక్ పాష, చెన్నయ్య, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెటల్‌రోడ్డుపై వాగ్వాదం..

పరిగి మండలం రాఘపూరం నుంచి శివారెడ్డిపల్లికి రావాల్సిన మెటల్‌రోడ్డును పూర్తిచేయాలంటూ జెడ్పీటీసీ నాగిరెడ్డి, స్థానిక సర్పంచ్ నరేందర్‌రెడ్డికి మధ్య ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సమక్షంలోనే వాగ్వాదం చోటుచేసుకుంది. గ్రామం నుంచి రాఘవపూర్ వరకు మెటల్‌రోడ్డు వేయాలని జెడ్పీటీసీ నాగిరెడ్డి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినప్పటికీ నేటికి స్పందించలేదని సర్పంచ్ నరేందర్‌రెడ్డి ఆరోపించారు. దానికి జెడ్పీటీసీ నాగిరెడ్డి సమాధానం ఇస్తూ.. సంవత్సర కాలంలోనే మెటల్‌రోడ్డు వేసుకోవాలని ప్రొసీడింగ్ ఇస్తే పనులు చేయలేకపోతున్నారని సర్పంచ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలు పక్కన బెట్టి గ్రామాభివృద్ధికి సహకరించాలని హితవు పలికారు.

గొర్రెల పంపిణీపై కాలయాపన తగదు

జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం

కడ్తాల్: గొల్లకుర్మలకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెండో విడుత గొర్రెల పంపిణీ చేపట్టాలని, గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం(జీఎంపీఎస్) జిల్లా అధ్యక్షుడు గౌర శ్రీశైలం డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని బీరప్ప ఆలయంలో.. మండల గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం మాట్లాడుతూ.. గొల్లకుర్మల ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన ఏ పార్టీలైనా వారిని మోసం చేస్తూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గొల్లకుర్మలకు రెండో విడుత గొర్రెల పంపిణీ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం.. నేటికీ పంపిణీ చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నగదు బదిలీతో రెండో విడుత గొర్రెల పంపిణీని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమస్యల సాధనకు కోసం ఈనెల 22న కడ్తాల్ మండల కేంద్రంలో గొర్రెకాపరుల సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సుకు పెద్దసంఖ్యలో గొల్లకుర్మలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు పెంటయ్య, సహాయ కార్యదర్శి మల్లేశ్, సంఘం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు యాదయ్య, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, జిల్లా కమిటీ సభ్యులు మల్లేశ్, వివిధ గ్రామాల సంఘాల అధ్యక్షుడు మల్లయ్య, శ్రీను, సత్యనారాయణ, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.



గొర్లకుర్మ సంఘం నేతలతో జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం